మతఘర్షణల నియంత్రణకు ప్రత్యేక ఫోర్స్

తీరప్రాంత జిల్లాల్లో తరచూ మత ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా సుహాస్‌శెట్టి, అబ్దుల్‌రహీం హత్యలు అదే తరహాలో కొనసాగాయి. దీంతో రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నక్సల్స్ నియంత్రణ దళంలోని 658మందిలో 248మందిని మతఘర్షణల నియంత్రణకు ప్రత్యేక ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో డీఐజీ, డీఎస్పీ, అసిస్టెంట్ కమాండెంట్ ఒకరు ఉంటారు. ఇన్‌స్పెక్టర్ కేడర్ 4, సబ్‌ఇన్‌స్పెక్టర్ కేడర్ 16, హెడ్‌కానిస్టేబుల్ 60, కానిస్టేబుళ్ళు 150మంది, అదనంగా 15మంది సిబ్బందిని కేటాయించారు. దక్షిణకన్నడ, శివమొగ్గ, ఉడుపి జిల్లాల్లో పనిచేయనున్నారు.

మతం.. కిరాతకం..!



- మత ఘర్షణల్లో బలవుతున్న అమాయకులు
- మూడు దశాబ్దాల్లో 45 మందికి పైగా హత్య
- దక్షిణ కన్నడ జిల్లాలో కలకలం
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ఫోర్స్


బెంగళూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో అందమైన ప్రాంతం, ఆధ్యాత్మికంగా దక్షిణభారతానికే తలమానికం అనిపించే హిందూ ఆలయాలు కొలువైన జిల్లా, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇష్టపడే ఉళ్ళాల దర్గా, వీటన్నింటితో పాటు దశాబ్దాలుగా పేరొందిన చర్చ్‌లు, ఓవైపు సముద్రం, మరోవైపు అంతర్జాతీయ విమానాశ్రయం. ఇలా దక్షిణకన్నడ జిల్లా గురించి చెప్పుకొంటూ పోతే అన్నీ ప్రత్యేకతలే. కానీ భయంకరం అనిపించే మతం వ్యామోహానికి అమాయకులు బలవుతున్నారు. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే ముగ్గురిని కిరాతకంగా హత్యచేశారు. హత్య జరిగేందుకు ముందు మతం కానీ, మృత్యువాత పొందాక అందరినీ కలచివేసే సంఘటనే. బాధిత కుటుంబాలే కాదు, వారి సన్నిహితులు, మిత్రులు, నివసించే ప్రాంతాల్లోనే ప్రతి ఒక్కరికీ కంటతడి పెట్టించేలా హత్యలు జరుగుతున్నాయి. దక్షిణకన్నడ జిల్లాలో దశాబ్దాలుగా ఇలా హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. 30ఏళ్ల వ్యవధిలో 45మందికిపైగా దారుణహత్యకు గురయ్యారు.

- 2006లో పశువుల రవాణాకు సంబంధించి బిజయ్‌లో మతగురువును హత్య చేశారు. అందుకు ప్రతీకారంగా మరో హత్య జరిగింది. అందుకు ప్రతీకారంగా ఓ రిక్షాడ్రైవర్‌ను చంపారు. వివాదం సమసిపోతుందనుకుంటున్న తరుణంలో సూరత్కల్ వద్ద చొక్కబెట్టవిలో బీజేపీ నాయకుడు సుఖానందశెట్టి హత్య జరిగింది. అంతిమయాత్రలో కొందరు యువకులు పోలీసులపై తిరగబడ్డం తీవ్ర పరిణామాలకు కారణమైంది. పోలీసు కాల్పుల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. జిల్లా వ్యాప్తంగా మతఘర్షణలకు కారణమైంది. ఆ తర్వాత ఉళ్ళాల, మాస్తికట్టె, ఫిరంగిపెట్టెలో హత్యలు జరిగాయి. ఈ గొడవలకు సూత్రధారులుగా నిర్ధారించబడిన రఫీక్, బుల్లెట్ సుధీర్‌లను ఎన్‌కౌంటర్ చేశారు. నెలల తరబడి కర్ఫ్యూ కొనసాగింది.
- 2008లో పొలళిలో అనంతు అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. తర్వాత ఆరేడేళ్లపాటు గొడవలు సద్దుమణిగాయి. 2015 అక్టోబరులో మూడబిద్రిలో పూల వ్యాపారి ప్రశాంత్‌పూజారిని హతమార్చారు. అంత్యక్రియలవేళ ప్రారంభమైన మత ఘర్షణలు కొనసాగాయి. నవంబరులో బంట్వాళలో హరీశ్‌పూజారి హత్య జరిగింది. సుఖానందశెట్టి హత్యకేసులో నిందితుడైన మాదూరు ఇసుగు జైలులోనే హత్యకు గురయ్యాడు. అదే ఏడాది మంగళూరులో మరో రెండు హత్యలు చోటు చేసుకున్నాయి.
- 2017 జూన్‌లో ఎస్‌డీపీఐ నాయకుడు అష్రఫ్ కళాయి హత్యతోపాటు మరోసారి తీరప్రాంతం భయాందోళనకు కారణమైంది. అదే ఏడాది జూలైలో బీసీ రోడ్డులో ఆర్ఎస్ఎస్ కార్యకర్త శరత్ మడివాళ హత్య జరిగింది. 2018లో సూరత్కల్‌లో దీపక్‌రావ్ హత్య జరిగింది. అందుకు ప్రతీకారంగా కొన్నిరోజుల్లోనే కొట్టారలో బషీర్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. 2022 జూలైలో మతఘర్షణలు మరోసారి పెరిగాయి. జూలై 19న బెళ్ళారె వద్ద కళంజిలో మసూద్‌పై దాడి జరిగింది. మూడు రోజుల తర్వాత అతను మృతి చెందాడు. ఇందుకు ప్రతీకారంగా ఐదు రోజుల తర్వాత బీజేపీ యువమోర్చా నాయకుడు ప్రవీణ్‌నెట్టారు హత్య జరిగింది. అందుకు ప్రతీకారంగానే జూలై 28న మహ్మద్ ఫాజిల్‌ను సూరత్కల్‌లో హతమార్చారు.
- తాజాగా ఈ ఏడాది ఏప్రిల్ 27న కుడుపువి లో గుంపుగా వచ్చినవారు దాడి చేయడంతో కేరళరాష్ట్రం వయనాడ్‌కు చెందిన అష్రఫ్ హత్య జరిగింది. మే1న రౌడీషీటర్, హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి దారుణహత్యకు గురయ్యాడు. అందుకు ప్రతీకారంగానే ఈనెల 27న బంట్వాళ తాలూకా ఇరాకూడిలో డ్రైవర్ అబ్దుల్ రహీంను కిరాతకంగా హత్య చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేయగా మరో పది మందిదాకా ఉన్నట్టు తెలుస్తోంది.
- 1960 కాలంలోనే ఇక్కడ మతఘర్షణలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. 1968లో మంగళూరు ఓడరేవులో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. 79-80ల మధ్య కాలంలో ముస్లిం యువకుడు, హిందూ యువతి ప్రేమకథ ఆధారంగా కరావళి అనే సినిమా విడుదల కాగా మతఘర్షణలు జరిగి హిందూ-ముస్లింల దుకాణాలకు నిప్పుపెట్టారు. హొయిగెబజార్, కుద్రోళి ఓడరేవు ప్రాంతాలలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. అయోధ్యలో బాబ్రీమసీదు ధ్వంసం చేసినప్పుడు మంగళూరులో గొడవలు జరిగాయి కానీ హత్యలు జరగలేదు.

దశాబ్దాలుగా హత్యాకాండ..

జిల్లాలో దశాబ్దాలుగా హత్యాకాండలు కలకలం రేపుతున్నాయి. 1998లో మత ఘర్షణలకు ఆరుగురు ముస్లిం, ఇద్దరు హిందువులు బలయ్యారు. చొక్కబెట్టవిలో డిసెంబరు 29న ఇంటినుంచి పాతసామగ్రి చోరీ చేశారనే కారణంతో ప్రారంభమైన గొడవ బైకంపాడి, కుళాయి, కృష్ణాపుర, హొసబెట్టు, తడంబైల్, కానా, కాటిపాళ్య, మంగళూరు, బంట్వాళ, పుత్తూరు ప్రాంతాలకు విస్తరించి గొడవలు జరిగాయి. ఆ ఏడాదిలో 9మంది మృతి చెందగా ఈ సంఘటనలో వందమంది గాయపడగా 300మందిపై కేసులు నమోదు చేశారు. 2001లో కందావరలో ఆటో డ్రైవర్ మతఘర్షణలో మృతి చెందాడు. 2002లో కుద్రోళిలో వడ్రంగి ఒకరు బలయ్యాడు. 2003లో సంచలనం అనిపించేలా ఓ అమ్మాయిని టీజ్ చేశారనే కారణంతో తలెత్తిన గొడవ ఏకంగా 10మంది హత్యకు గురయ్యారు. నరసింహశెట్టిగార్ అనే వ్యక్తి హత్యకు ప్రతీకారంగా రిక్షాడ్రైవర్ అయిన ఓ వర్గం యువకుడిని హతమార్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో హత్యలు జరిగాయి. క్లాక్‌టవర్ వద్ద పోలీస్ కానిస్టేబుల్‌ను హతమార్చారు. ఆ తర్వాత భారీ బందోబస్తుతోపాటు కఠిన చర్యలతో ఏడాదిపాటు ప్రశాంతం అనిపించింది. 2005లో తాలూకా పంచాయతీ అధ్యక్షుడు జబ్బార్ హత్య మరోసారి మతఘర్షణలకు దారి తీసింది. ఓ రిక్షా డ్రైవర్, ఓ లారీ క్లీనర్ బలయ్యారు.

నేడు కవి వెంకటేశ్‌మూర్తి అంత్యక్రియలు



- సీఎం సహా పలువురు ప్రముఖుల సంతాపం



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి శివరాజ్ తంగడిగి

బెంగళూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ కవి హెచ్ఎస్ వెంకటేశ్ మూర్తి (80) అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. ఆయన మృతిపై పలువురు నివాళి అర్పించారు. వయోసహజ సమస్యలతో శుక్రవారం ఉదయం ఆయన కన్నుమూశారు. 1944లో దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకా హరాదిగెరె గ్రామంలో జన్మించారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో కన్నడ ఎంఏ చదివారు. 30ఏళ్లపాటు బెంగళూరులోని సెయింట్‌జోసెఫ్ కామర్స్ కాలేజ్‌లో కన్నడ అధ్యాపకుడిగా సేవలందించారు. కన్నడలో 'కథా కవనాలు'పై పీహెచ్‌డీ పొందారు. వందకుపైగా పుస్తకాలు రచించారు. పలు నాటికలు సైతం రాశారు. పలు కన్నడ సినిమాలకు పాటలు రాశారు. 'కథన - కవన' అనే రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం లభించింది. కలబురగిలో జరిగిన కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడిగా వ్యవహరించారు. పలు పురస్కారాలను ఆయన పొందారు. పార్థివదేహాన్ని రవీంద్రకళాక్షేత్ర వెనుకభాగంలో బయలుమందిరంలో ఉంచారు.

సీఎం సహా ప్రముఖుల సంతాపం

సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రులు కుమారస్వామి, ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, సోమణ్ణ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సాహితీవేత్తలు, అభిమానులు రవీంద్రకళాక్షేత్ర వద్దకు కడచూపుకోసం వచ్చారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజ మహేశ్‌జోషి, సినీ దర్శకుడు నాగాభరణ, తదితరులు నివాళులు అర్పించారు. శనివారం ఉదయం అంత్యక్రియలు జరగనున్నాయి.

కృష్ణా నదికి పెరిగిన వరద

- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

రాయచూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కృష్ణనదిలో నీటి ప్రవాహం పెరిగే ఆస్కారం ఉన్నందున రాయచూరు తాలూకాలోని నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సురేశ్ వర్మా శుక్రవారం ప్రకటించారు. ఇప్పటికే భీమా నది నుంచి పెద్ద ఎత్తున ప్రవాహం కృష్ణనదిలోకి వస్తున్నందున ఇప్పటికే రాయచూరు జిల్లా పరిధిలో కృష్ణనదిలో ప్రవాహం పెరిగిందన్నారు. దీనికి తోడు త్వరలోనే నారాయణపూర్ డ్యాం నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున తాలూకాలోని లోతట్టు గ్రామాలు ముఖ్యంగా కృష్ణనది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



కృష్ణా నదిలో ప్రవహిస్తున్న నీరు

ఎంఎస్ఎంఈల ప్రగతితోనే ఉద్యోగాలు.. ఉపాధి

- జిల్లాకో ఈఎస్ఐ ఆసుపత్రి
- రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు: కేంద్రమంత్రి శోభా కరంద్లాజె

బెంగళూరు, మే 30(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయంపై ఆధారపడిన తర్వాత అత్యధికమంది కార్మికులుగా కొనసాగుతున్నారని, ఎంఎస్ఎంఈల ప్రగతితోనే ఉద్యోగ, ఉపాధి సాధ్యమని కేంద్ర కార్మిక సంక్షేమశాఖ మంత్రి శోభాకరంద్లాజె పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో మీడియాతో మాట్లాడిన మంత్రి 11ఏళ్లలో ఉపాధి మెరుగైందని, ఈఎస్ఐ, పీఎఫ్‌లు చెల్లించేవారి సంఖ్య పెరిగిందన్నారు. ఉద్యమ్ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా 6.3 కోట్ల పరిశ్రమలు ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. ఇంకా రిజిస్టర్ చేసుకోవాల్సిన వారు ఉన్నారన్నారు. దేశ జీడీపీలో ఉత్పత్తిరంగం 45శాతం ఉండేందుకు, ఎంఎస్ఎంఈలే కారణమన్నారు. కార్మికులు పెరుగుతున్న తరుణంలో జిల్లాకో ఇఎస్ఐ ఆసుపత్రి ఉండాలనేది ప్రధానమంత్రి ఆశయమన్నారు. ఆయుష్మాన్ ద్వారా నగదు రహిత వైద్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ-శ్రమ్ కార్డులు చేయించుకోవచ్చునన్నారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడం పీణ్యాలో ఉందన్నారు. 16వేల పరిశ్రమలు ఉన్నాయన్నారు. ప్రభుత్వరంగ, రంక్షణరంగ సంస్థలకు అనుబంధంగా పనిచేసే ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. దేశంలో యువతకు కొదవ లేకున్నా నైపుణ్యత సవాల్‌గా మారిందన్నారు. అందుకే నైపుణ్యకేంద్రాలను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన మానవవనరులను సమకూర్చదలిచామన్నారు. బ్రిటీష్ కాలంనాటి కార్మికచట్టాలు ఇంకా కొనసాగుతున్నాయని, వాటిని సవరించేందుకు కేంద్రం 4 విధానాలు తీసుకొస్తున్నామని ఇప్పటికే పలు రాష్ట్రాలు సిద్ధమయ్యాన్నారు. గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్స్‌కు సౌలభ్యాలను, ప్రగతి సంక్షేమాలను అభివృద్ధి చేయదలిచామన్నారు. చిక్కబళ్ళాపురలో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించామని కానీ రాష్ట్రప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు సుముఖత చూపడం లేదన్నారు.



ఎంఎస్ఎంఈ సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి

కాంగ్రెస్ పాలనలో ప్రాణాలకు గ్యారెంటీ లేదు..

కాంగ్రెస్ పాలనలో ప్రాణాలకు గ్యారెంటీ లేదని మంత్రి శోభాకరంద్లాజె అన్నారు. ఇంటినుంచి బయటకు వెళ్లినవారు మళ్లీ వచ్చేదాకా గ్యారెంటీ లేనట్టేనన్నారు. ప్రాణాలు కాకుండా మిగిలిన అన్నింటికీ గ్యారెంటీలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. హోం మంత్రి అవినీతిలో ఇరుక్కునారని, మాఫియా చేతిలో కూరుకుపోయారన్నారు. ఇలాంటి వారితో రాష్ట్రంలో శాంతిభద్రతలు ఊహించగలమా అన్నారు. 2013లో సీఎం సిద్దరామయ్య పీఎఫ్ఐ కార్యకర్తలపై నమోదైన కేసులను రద్దు చేసి 800 మంది రౌడీలను రోడ్డుకి తెచ్చారన్నారు. హుబ్బళ్ళి పోలీస్‌స్టేషన్‌కు నిప్పుపెట్టి, పోలీసులపై దాడి, వాహనాలను ధ్వంసం చేసిన ఘటనతోపాటు 46 కేసులను ప్రభుత్వం వాపసు తీసుకుందన్నారు. 46 కేసులలో 1500మంది క్రిమినల్స్ బయటపడ్డారన్నారు. అయితే హైకోర్టు ప్రభుత్వ నిర్ణయానికి చెంపపెట్టులాంటి తీర్మానం చేసిందన్నారు. దక్షిణకన్నడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దినేశ్‌గుండూరావు ముస్లింలకు రక్షణ లేదని వ్యాఖ్యానిస్తారని, ఆయన ఓ సామాజికవర్గానికి మంత్రా లేక జిల్లాకా అంటూ ప్రశ్నించారు.

బోనులో చిక్కిన చిరుత

బళ్లారి గాంధీనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ జిల్లా, మొళకాల్మూరు తాలూకా బ్రహ్మగురి కొండల్లో చిరుత బోనులో చిక్కింది. ఇటీవల ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో అటవీశాఖ అధికారులు చిరుతను పట్టుకోవడానికి బోనులు ఏర్పాటు చేశారు. తాలూకా పరిధిలోని జట్టంగి రామేశ్వర గొండ, కోతిగుడ్డ, మాచేనహళ్ళి, దేవసముద్ర, వెంకటాపురం, దేవసముద్రం చుట్టుప్రక్కల గ్రామాల చిరుత పులులు తిరుగుతుండంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు. బ్రహ్మగిరి గొండల్లో గోశాలలో 10 రోజుల క్రితం రెండు పశువులపై దాడిచేసింది. ఎట్టకేలకు చిరుత పట్టు పడడంతో ఆయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



బోనులో చిక్కిన చిరుత

అవకాశం దక్కేనా..?

- మంత్రి వర్గ విస్తరణ కోసం బళ్లారి నేతల ఎదురుచూపు
- 6న ఏఐసీసీ సమావేశం

బళ్లారి, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గంలో చేర్పులూ...మార్పులు ఉంటాయి.? ఉంటే ఎవరికి అవకాశం దక్కుతుంది.? మరి ఎవరికి ఉద్వాసన ఉండొచ్చు.? మాజీ మంత్రికి నాగేంద్రకు ఈసారి మంత్రి వర్గంలో స్థానం ఉండొచ్చా..?అనే రాజకీయ చర్చలు జిల్లాలోల జోరందుకున్నాయి. వచ్చే నెల 6న ఢిల్లీలో ఏఐసీసీ సమావేశం కానుంది. అక్కడ పార్టీ వ్యవహారాలతో పాటు కర్ణాటకలో మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు పై ప్రధాన చర్చ జరిగే అవకాశం ఉందని సమాచారం. ఎస్టీ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ఎస్టీ సంక్షేమ శాఖ, యువజన క్రీడలు శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి. నాగేంద్రను మంత్రి వర్గం నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. కొన్ని రోజులు జైలు జీవితం కూడా గడిపిన ఆయన ఇందులో తన పాత్రలేదు, అనవసరంగా ఇరికించారని వాపోతున్నారు. అయితే లోకాయుక్త, సీబీఐ అధికారులు మాత్రం నాగేంద్రను రెండుమూడు దపాలు విచారణ చేసి తరువాత కేసు పెట్టి జైలుకు పంపించారు. అంతే కాకుండా ఆయన విచారణకు తిరిగి హాజరు కావాలని లోకాయుక్త నోటీస్ జారీ చేసింది. నాగేంద్ర మాత్రం ఈ కేసులో నేను బలి పశువు అయ్యానని తన అనుచర, సహచరులతో ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. మంత్రి పదవి తిరిగి తెచ్చుకునేంత వరకూ నేను బళ్లారిలో అడుగు పెట్టను అని నాగేంద్ర శపథం చేసి మరీ బెంగళూరులో కూర్చున్నాడు. కానీ వాల్మీకి జయంతి, అబెడ్కర్ జయంతి రోజుల్లో ఆయన బళ్లారిలో వచ్చారు. అంతే కాకుండా ఇక సీఎం సిద్దరామయ్య విమానంలో జిందాల్ నుంచి వెళ్లినపుడు టెక్నికల్ హాల్ట్ తీసుకుంటే అక్కడికి వెళ్లి రెండు, మూడు సార్లు కలిశారు. కాంగ్రెస్ విజయనగర జిల్లా లోని హొస్పేట్‌లో చేసిన సంకల్ప యాత్ర లో నాగేంద్ర హజరయ్యారు. అక్కడ కూడా పెద్దగా ఆయనకు ప్రాధాన్యం దక్కలేదని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అంతే కాకుండా ఆయనకే కాదు అసలు బళ్లారి ఎమ్మెల్యేలకు ఇక రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం కోసం సీనియర్ నాయకులు చాలా మంది ఎదురు చూస్తున్నారు. ఈ సారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బళ్లారి జిల్లా నుంచి మంత్రి వర్గంలో గణేష్ కూడా రేసులో ఉన్నాడనే ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతుంది. సండూరు ఎమ్మెల్యే తుకారాం అన్నపూర్ణ కూడా మహిళా కోటాలో మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరుతున్నట్లు సమాచారం. ఇక బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి కూడా యువకుల కోటాలో నాకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతున్నట్లు రాజకీయంగా చర్చలు జరుగుతున్నాయి. ఇలా ఎవరికి వారు మంత్రి పదవి పై ఆశలు పెట్టుకున్నారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి. బళ్లారి జిల్లాలో మంత్రి లేక పోవడం వల్ల కొంత అభివృద్ధి పనులు కుంటపడుతున్నాయని కొందరు నాగేంద్ర అనుచరలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారైనా జిల్లా నేతలకు అవకాశం దక్కేనా లేదో వేచి చూడాలి.



డీకేతో మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే అన్నపూర్ణ (ఫైల్)

శాంతించని వరుణుడు..!

- దక్షిణ కన్నడ జిల్లాలో గోడకూలి ఒకరు.. మట్టిచరియ పడి ముగ్గురు మృతి

బెంగళూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరుణుడు శాంతించేలా లేదు. నైరుతి రుతుపవనాలకు ముందే రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రత్యేకించి కావేరి నదికిపైభాగాన కృష్ణానదీ పరీవాహకం మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు నమోదవుతున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని 14 జలాశయాలకు 54 టీఎంసీల నీరు చేరింది. ఈనెల 23నుంచి నిరంతరంగా వర్షాలు కురుస్తుండడంతో కావేరి, కృష్ణ, తుంగభద్ర, కబిని హేమావతి నదులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. కేఆర్ఎస్ జలాశయం, ఆల్మట్టి, నారాయణపురతోపాటు అన్ని జలాశయాలకు నీరు పెరిగింది. కృష్ణనదికి అనుబంధంగా ఉండే జలాశయాలకు 27 టీఎంసీల నీరు, కావేరి నదికి అనుబంధంగా ఉండే డ్యామ్‌లకు 19 టీఎంసీలు ఇతర జలాశయాలకు 8 టీఎంసీలు నీరు చేరింది. వాతావరణ పరిశోధనశాఖ తెలిపిన మేరకు రాష్ట్రంలోని జలాశయాలలో 298 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీన్నిబట్టి 33శాతం నీరు నిల్వ ఉన్నట్టయ్యింది. రాష్ట్రంలోని అన్ని జలాశయాల గరిష్ఠనీటి మట్టం 895 టీఎంసీలుగా ఉంది. లింగనమక్కికి 23శాతం, సూపా, వారాహికి 28శాతం, భద్రకు 37శాతం, తుంగభద్రకు 12, ఘటప్రభకు 19, మలప్రభకు 28, నారాయణపురకు 60, హారంగి 43, హేమావతి 62, కేఆర్ఎస్ 43, కబిని 73, వాణివిలాస్ సాగర్ 84శాతంగా నీటిమట్టం ఉంది.

కాగా దక్షిణకన్నడ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావంతో సామాన్యులు తల్లడిల్లే పరిస్థితి ఏర్పడింది. దక్షిణకన్నడ జిల్లా ఉళ్ళాల తాలూకా వ్యాప్తంగా జలప్రళయం అనిపించింది. బెళ్మె గ్రామం, కానకర గ్రామంలో కాంపౌండ్ గోడ కూలి బాలిక ఫాతిమా నయీం (10) మృతి చెందింది. మంజనాడి సమీపంలోని కోడి ప్రాంతంలో మట్టిచరియలు విరిగి కాంతప్ప పూజారి భార్య ప్రేమ పూజారి (50)తోపాటు మనవళ్ళు మూడేళ్ల ఆర్యన్, రెండేళ్ల అరుష్‌లు మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందినట్టయ్యింది. కాగా ప్రమాదంలో కాంతప్ప కాలు విరిగింది. ఓ మహిళతోపాటు ఇద్దరు పిల్లలు మట్టిలో కూరుకుపోగా హుటాహుటిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టినా ప్రయోజనం దక్కలేదు. రబ్బర్‌బోట్లు, పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



దక్షిణకన్నడ జిల్లాలో బాధితులను పడవల్లో తరలిస్తున్న అధికారులు



ఫాతిమా నయీం (ఫైల్)

చేపలవేటకు వెళ్లి ఇద్దరు గల్లంతు

దక్షిణకన్నడ జిల్లాలో రెడ్ అలర్ట్‌తోపాటు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించినా తోటంబెగ్రే ప్రాంతానికి చెందిన ఇద్దరు సముద్రంలోకి బోటుతోపాటు వెళ్లి నీటిపాలయ్యారు. యశ్వంత్, కమలాక్షలు గల్లంతైన వారిగా గుర్తించారు. వారికోసం గాలింపు చేపట్టారు.



కూలిన భారీ వృక్షం

వీఎస్‌కేయూలో డిగ్రీ పట్టాల గోల్‌మాల్...

- 3,330 డిగ్రీ పట్టాలు నకిలీవని తేల్చిన విచారణ సమితి

బళ్లారి గాంధీనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని విజయనగర శ్రీ కృష్ణదేరాయల విశ్వవిద్యాలయం(వీఎస్‌కేయూ)లో డిగ్రీ పట్టాల పంపిణీలో భారీగా అవకతవకలు జరిగాయని విశ్వవిద్యాలయం ఉన్నత విద్యాశాఖకు విచారణ సమితి నివేదిక అందజేసింది. ఇప్పటి వరకు 3,330 మంది నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసి స్నాతకోత్సవ ప్రమాణ పత్రాలు పంపిణీ చేసినట్లు విచారణ సమితి తన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. విజయనగర శ్రీ కృష్ణవిశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి వేలాదిమందికి స్నాతకోత్సవం సమయంలో నకిలీ ప్రమాణ పత్రాలు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వెలుగు చూశాయి. ఇందులో విశ్వవిద్యాలయంలో పనిచేసే ఉన్నతాధికారులతో ఆటు పరీక్షా విభాగంలో పనిచేసే ఔట్ సోర్స్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో 10సంవత్సరాలకు సంబంధించి ప్రమాణ పత్రాల పంపిణీ, వాటికి సంబంధించిన రశీదులను జెల్లడ పట్టడంతో అవినీతి బాగోతం బట్టబయలైంది. దీనిపై ప్రత్యేక విచారణ కమిటి ఏర్పాటు చేసింది. విచారణ బృందం మొత్తం 45వేల ప్రమాణ పత్రాలను పరిశీలించి 68 పేజీల నివేదికను తయారు చేసింది. ఒక్కో డిగ్రీ పట్టాకు కనీసం రూ 8వేల వరకు విద్యార్థుల నుంచి వసూలు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. తద్వారా విశ్వవిద్యాలయం ఆదాయానికి భారీగా గండి పడినట్లు తెలుస్తోంది. ఇదే సంవత్సరం ఫిబ్రవరి నెలలో స్నాతకోత్సవం ప్రమాణ పత్రాల అవ్యవహారం బయటపడింది. దీనికి కోసం విచారణ కోసం మౌల్యాంకన రిజిస్ట్రార్ ఫిబ్రవరి 20న తొమ్మిది మందితో కూడిన విచారణ సమితి ఏర్పాటు చేశారు. ఐదు రోజుల లోపు నివేదిక అందజేయాలని సూచించారు. అయితే విచారణకు సంబంధిచి రికార్డుల పరిశీలన సమయం తీసుకోవడంతో నివేదిక అందజేయడంలో ఆలస్యమైనట్లు సమితి వెల్లడించింది. ఇదే నివేదికల ఆధారంగా గతంలో ఇద్దరు పరీక్షా పత్రాల మౌల్యాంకన రిజిస్ట్రార్‌తో చేరి కొంతమంది సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. వారిని విచారణ సమితికి అప్పగించినట్లు విశ్వవిద్యాలయం వీసీ మీడియాకు తెలిపారు. విచారణ సమితి నివేదిక అందజేసినా, అవకతవకలకు పాల్పడిన వారిపై విచారణ జరపలేదని తెలిసింది. విచారణ అనంతరం విషయాన్ని సిండికేట్ సభ దృష్టికి తీసుకురానున్నట్లు వైస్ చాన్స్‌లర్ వివరించారు. అనంతరం ఉన్నత స్థాయి విచారణ జరపడమా... లేదా అవకతవకలకు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమా అనే విషయంపై నిర్ణయం తీసుకోనున్నట్లు వైస్ చాన్స్‌లర్ వివరించారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్ర, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులు

సీతారామచంద్రుడికి అభిషేకం

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా శుక్రవారం సీతారామ చంద్ర ఆంజనేయ స్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. యాగశాలలో ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

ట్రోలింగ్ దుర్మార్గం: రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో సైనికాధికారుల కుటుంబ సభ్యులను సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 'పెహల్గాం ఉగ్రవాదుల దాడి-తదనంతరం పరిణామాలు' అనే అంశంపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా సమైక్యతా భావం వెల్లివిరిసిందని అన్నారు. అమెరికా ఆదేశాలతో కాల్పుల విరమణ, తదనంతరం జరిగిన సంఘటనలు మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు. కొన్ని మూకలు సైనికాధికారుల కుటుంబసభ్యులను ట్రోలింగ్ చేయడం సమైక్యతకు సవాలుగా మారిందని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ మౌనమునిగా మారిపోవడం ఆందోళనకరమని అన్నారు. కేంద్రానికి మద్దతు ఇస్తున్న టీడీపీ, జనసేన ఈ ట్రోలింగ్‌ను ఖండించలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు సురేష్, సీపీఐ నాయకుడు సురేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణనాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీ బోగీలో అనుమానితుడు

పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు

గుత్తి, మే 30(ఆంధ్రజ్యోతి): ఏసీ బోగిలో అనుమానాస్పదంగా కనిపించిన నంద్యాల జిల్లాకు చెందిన జయరాజ్ అనే వ్యక్తిని రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇతను రైళ్లలో చోరీకి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన గాలిపోతుల జయరాజ్ అలియాస్ దేవరాజ్.. మచిలీపట్నం నుంచి ధర్మవరంకు వెళ్లే రైలులో ఏ1 ఏసీ బోగిలో అనుమానస్పదంగా కనిపించాడు. దీంతో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది అదుపులోకి తీసుకుని, రైల్వే హెల్ప్ లైన్‌కు సమాచారం అందించారు. రైలు గుత్తి పోర్ట్ రైల్వే స్టేషన్‌కు రాగానే అతన్ని గుత్తి రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్నుంచి ఒక సెల్‌ఫోన్, రెండు తులాల బంగారు తాళిబొట్టు చైన్, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.



గుత్తిపోర్ట్ రైల్వేస్టేషన్‌లో జయరాజ్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

వర్షం రాకతో తీరిన పశుగ్రాస సమస్య

చిలమత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): వరుణ దేవుడు కరుణించాడు. వర్షాకాలం ప్రారంభానికి ఇంకా 20 రోజులు ఉండగానే ముందస్తుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో జనజీవనం ఊపిరిపీల్చుకుంది. ప్రధానంగా మూగజీవాలకు ప్రాణం పోసినట్లైంది తీవ్ర పశుగ్రాస సమస్యతో బాధపడుతున్న వాటికి కురుస్తున్న వర్షాలతో పచ్చిక బయళ్లు చిగురిస్తున్నాయి. తద్వారా వాటి మేత సమస్య తీరినట్లేనని చెప్పాలి. ఈ ఏడాది మార్చి నుంచి తీవ్ర ఎండల కారణంగా మూగజీవాలకు మేత కరువైంది. చాలా చోట్ల గ్రాసం సరిగా అందక పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయాయి. ఇక మేకలు, గొర్రెల సంగతి చెప్పనక్కర్లేదు. వాటిని మేత కోసం బయళ్లకు తీసుకెళ్లినా పిడికెడు మేత దొరకడం గగనమైపోయింది. దానికి తోడు పచ్చిక బయళ్లకు వేసవిలో కొందరు నిప్పు పెట్టడంతో ఉన్న మేత కూడా అగ్నికి ఆహుతైంది. ఈ తరుణంలో మే మొదటి వారం నుంచే వరుణ దేవుడు కరుణించాడు. అప్పటి నుంచి అడపాదడపా ఓ మోస్తరు భారీ వర్షాలు నమోదవుతున్నాయి. సాధారణంగా రుతుపవనాల గమనం ప్రతి ఏటా ఆలస్యయ్యేది. కానీ ఈ ఏడాది ముందస్తుగా రాష్ట్రాన్ని తాకడంతో వాటి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి.

43 పోస్టులకు 1804 దరఖాస్తులు

- వైద్యవిధాన పరిషత్‌లో పోస్టులకు పోటాపోటీ
- మొదలైన పైరవీలు.. రంగంలోకి దళారీలు

అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యవిధాన పరిషత్ పరిధిలో వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. మొత్తం 43పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరించారు. గడువు ముగియడంతో వచ్చిన దరఖాస్తులను లెక్కించి, స్క్రూట్నీ ప్రక్రియను శుక్రవారం మొదలు పెట్టారు. మొత్తం 1804 దరఖాస్తులు వచ్చినట్లు తేల్చారు. ఇందులో 04ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులకు 293, 03 ఆఫీస్ సబార్డినేటర్ పోస్టులకు 266, 22 జనరల్ డ్యూటీ అటెండెన్స్ పోస్టులకు 832, 02 రికార్డు అసిస్టెంట్ పోస్టులకు 191 దరఖాస్తులు వచ్చాయని డీసీహెచ్ఎస్ డాక్టరు పాల్ రవికుమార్ తెలిపారు. ఈనాలుగు కేటగిరీ పోస్టులకు 1582 దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగిలిన బయోమెడికల్ ఇంజనీర్, రేడియోగ్రాఫర్, ఫిజియోథెరపిస్టు, ఆపరేషన్ థియేటర్, పోస్టుమార్టమ్ అసిస్టెంట్, ప్లంబర్ పోస్టులకు అన్నింటికి కలిపి కేవలం 222 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని డీసీహెచ్ఎస్ తెలిపారు. అన్నిపోస్టులకు కలిసి 155 మంది పీహెచ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. పోటీ అధికంగా ఉండటంతో ఆశావహులు పైరవీలు మొదలు పెట్టారు. కొందరు దళారీలు రంగంలోకి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరికొందరు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు ఇప్పిస్తున్నారని తెలిసింది.

అదే కావాలి..!

- ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలోనే పోస్టింగ్ కావాలి
- ఆర్అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో వద్దు
- ధర్మవరం బదిలీ చేసినా ఓడీపై ఇక్కడికే రాక
- సీటు పదిలం కోసం 5 సిఫార్సు లెటర్లు
- హాట్‌సీట్‌గా ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పోస్టు

అనంతపురం న్యూటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ పోస్టు హాట్ సీట్‌గా మారింది. ఈ సీట్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి తప్పనిసరి బదిలీల్లో భాగంగా ధర్మవరం వెళ్లాడు. అయితే తన పలుకుబడిని ఉపయోగించి ఓడీపై తిరిగి వచ్చాడు. వేతనం ధర్మవరంలో తీసుకుంటూ ఉద్యోగం అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో నిర్వహిస్తున్నాడు. అనంతపురంలో విధులు నిర్వర్తించాల్సిన వ్యక్తి మాత్రం ఓడీపై ధర్మవరంలో పని చేస్తున్నాడు. ప్రస్తుత బదిలీల్లో అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో వేతనం తీసుకుంటూ ధర్మవరంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గోపాల్ ఆరోగ్య సమస్యలతో సొంత జిల్లా నంద్యాలకు బదిలీ చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానం ఖాళీ కానుంది. అయితే కళ్యాణదుర్గం నుంచి శ్రీనివాసులు ఇక్కడికి రావడానికి సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఆమేరకు గురువారం కర్నూలు సర్కిల్ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు కూడా హాజరయ్యారు. అయితే ఇప్పటికే ఇదే స్థానంలోనే ఐదేళ్లు పూర్తి చేసుకొని, మరో రెండేళ్లు ఓడీపై పని చేస్తున్న మరో సీనియర్ అసిస్టెంట్ మాత్రం మరొకరికి అవకాశం లేకుండా తానే ఉండేలా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఏకంగా ఐదుగురు ప్రజా ప్రతినిధుల నుంచి సిపార్సు లేఖలను అధికారులకు కౌన్సెలింగ్‌లో సమర్పించినట్లు తెలిసింది. ఆయన ఈ సీటుపై చూపిస్తున్న అతి ఉత్సాహం ఆ కార్యాలయంలోని సిబ్బందికి అనుమానాలు కలగజేస్తోంది.

ఆర్అండ్‌బీకి వెళ్లం



ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానం ఖాళీగా ఉంది. అక్కడికి మాత్రం ఎవరు రావడం లేదు. ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ స్థానానికి ఎందుకంత డిమాండన్నది ఆర్అండ్‌బీలోను ఎన్‌హెచ్‌లోను చర్చనీయాంశంగా మారింది. ఏళ్లుగా ఒకే సీటులో పని చేస్తున్న ఆ సీనియర్ అసిస్టెంటును స్థానిక అధికారులు వ్యతిరేకించి మరొకరికి అవకాశం కల్పిస్తారేమోననే అనుమానంతో శుక్రవారం సంబంధిత ఉన్నతాధికారులను ఆయన తనకు న్యాయం చేయాలని విన్నవించుకున్నట్లు కార్యాలయంలో ప్రచారం జరుగుతోంది.

యూనియన్ తరపున పోరాటం

ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఏడున్నర సంవత్సరాలుగా పని చేస్తున్నవారికే మరో సారి స్థానం కల్పిస్తామంటే కుదరదు. కొత్తవారికి అవకాశం లేకుండా సిఫార్సులకే ప్రాధాన్యం ఇస్తే యూనియన్ తరపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని కొందరు ఆ కార్యాలయంలోని యూనియన్ నాయకులు బహిరంగంగానే చెప్పుకొస్తున్నారు. అసలు ఆ సీటులో ఏముంది. ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానానికి మాత్రం ఎవరు నియమించిన రావడం లేదు. ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ స్థానానికి ఎందుకు అంత డిమాండ్ అన్నది అర్థం కావడం లేదు.

సీఐటీయూతోనే కార్మిక వర్గాలకు విముక్తి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్
- జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

అనంతపురం కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని కార్మిక వర్గాల సమస్యలకు సీఐటీయూతోనే విముక్తి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ జెండాలను శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్ వద్ద నాగేంద్రకుమార్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. 1970లో సీఐటీయూ ఆవిర్భావం నుంచి నేటివరకూ అవిశ్రాంతంగా పోరాటాలు చేస్తోందని, కార్మికవర్గానికి వెన్నుదన్నుగా ఉంటోందని అన్నారు. పదుల సంఖ్యలో కార్మిక చట్టాలు సాధించుకుని, కార్మికులకు రక్షణ కవచంగా సీఐటీయూ నిలిచిందని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, కార్మికుల కనీస వేతనం కోసం, హక్కుల సాధనకోసం, రక్షణకోసం నిత్యం ఐక్య పోరాటాలు చేస్తోందని అన్నారు. బ్రిటీష్‌వారి హయాం నుంచి 44 రకాల కార్మిక చట్టాలను పోరాడి సాధించుకున్నామని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని, ఇవి కార్మికులకు ఉరితాడుగా మారాయని విమర్శించారు. దేశ భవిష్యత్తుకోసం నాలుగు కార్మిక కోడ్‌ల రద్దు, 29 కార్మిక చట్టాల అమలుకోసం జూలై 9న దేశవాప్తంగా కార్మికుల సార్వత్రిక సమ్మె చేపడుతున్నామని తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు, జిల్లా కార్యదర్శి రమాదేవి, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్, సివిల్ సప్లై, జనరల్ హమాలీలు, అంగన్వాడీ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్, మెడికల్ రెప్రజెంటేటివ్ యూనియన్‌ల నాయకులు శ్రీనివాసులు, ఆజాం బాషా, ఆదినారాణ, సురేంద్ర, శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు పరిష్కారం

కలెక్టర్ వినోద్ కుమార్



అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, 22-ఏ భూములను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. 22ఏకు సంబంధించి 16 క్లెయిమ్స్, చుక్కల భూములకు సంబంధించిన 31 దరఖాస్తులపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నిబంధల మేరకు ఉన్నవాటిని ఆమోదించారు. మిగిలినవాటిని పునః సమీక్షకు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కాలువ కోసం భూములివ్వండి

రైతులకు సీపీఐ నాయకుడు జగదీశ్ వినతి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

గుంతకల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): రాగులపాడు వద్ద నుంచి చెరువులకు నీరందించే హంద్రీనీవా కాలువ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములను ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, రైతు సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవన్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాగులపాడు నుంచి హంద్రీనీవాలో కాలవను తవ్వితే వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లోని చెరువులకు పుష్కలంగా నీరందుతుందని అన్నారు. ఇందుకోసం 215 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవచ్చిందని అన్నారు. ఈ కాలవ పూర్తి అయితే 12 చెరువులు, 15 చెక్‌డ్యాంలకు నీరు లభిస్తుందని, పరివాహక ప్రాంతంలోని పొలాల్లో వేలాది బోర్లు రిచార్జ్ అవుతాయని అన్నారు. భూసేకరణలో సమ్మతి తెలపాలని రైతులను కోరారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే సత్వరమే కాలవను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారని అన్నారు. ఈ విషయంగా పలు రైతు సంఘాల నాయకులతో కలసి తాము రైతులతో భేటీ అవుతామని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, రామాంజనేయులు, రైతు సంఘాల నాయకులు పులగుట్టపల్లికి చెందిన జయన్న, పామన్న, రామాంజనేయులు, మల్లేనిపల్లికి చెందిన శ్రీనివాసులు, పాత గుంతకల్లు పెన్నయ్య, జి కొట్టాల బాలకృష్ణ, ఎన్ కొట్టాల సయ్యద్ బాషా, దోనిముక్కల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నెట్టెం

అనంతపురం క్లాక్‌టవర్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నెట్టెం వెంకటేష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం జీఓ నంబరు 366 జారీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్‌ను సీఎం చంద్రబాబు ప్రకటించి నెల గడిచింది. డీసీఎంఎస్‌కు, ఏడీసీసీబీకి ఏడుగురు చొప్పున సభ్యులు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో తాత్కాలిక పాలకవర్గ సభ్యులను నియమించిన వెంటనే ఏడీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేస్తారు.

తల్లీకొడుకుల అదృశ్యం



అదృశ్యమైన హంసలత, కుమారుడు యశ్వంత్ (ఫైల్)

శెట్టూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కునుకూరుకు చెందిన హంసలత, ఆమె కుమారుడు యశ్వంత్ గురువారం నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఆమె భర్త మోహన్ బాబు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులందరూ కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చేసరికి ఇద్దరూ అదృశ్యమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 9440796818, 9346917104 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శివ కోరారు.

సచివాలయ ఉద్యోగిపై టీడీపీ నాయకుడి బూతుపురాణం

అనంతపురం క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): నగరపాలిక పరిధిలోని 29వ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అశ్వర్థరెడ్డిని 30వ డివిజన్ టీడీపీ నాయకుడు రాజేష్ అసభ్య పదజాలంతో దూషించాడు. కడపలో జరిగిన మహానాడుకు జనాలను ఎందుకు తరలించలేదని నిలదీశాడు. తాను అందరికీ ఫోన్ చేశానని అశ్వర్థ రెడ్డి చెబుతున్నా వినిపించుకోకుండా చిందులు వేశాడు. 'సచివాలయం విడిచిపెట్టి పోరా.. సచివాలయంలో ఉండి ఏం పీకుతున్నావ్..? కాళ్లు విరగ్గొడతా..' అని బూతు పురాణం వినిపించాడు. 'అన్నా.. పద్ధతిగా మాట్లాడు.. నేను అందరికీ ఫోన్ చేశా.. కావాలంటే కాల్ లిస్టు చూపిస్తా..' అని అశ్వర్థ రెడ్డి చెబుతున్నా.. రాయలేని భాషలో తిడుతూ రెచ్చిపోయాడు. ఈ ఆడియో సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయింది. టీడీపీ నాయకుడి తీరును సచివాలయ ఉద్యోగులు తప్పుబడుతున్నారు. ఆయనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బదిలీ సమయంలో ప్రమోషన్‌లా..?

జడ్పీలో నిర్ణయాలపై తీవ్ర విమర్శలు

అనంతపురం విద్య, మే 30(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయంలో జడ్పీ పాలకులకు, అధికారులకు ప్రమోషన్లు గుర్తుకువచ్చాయి. అనుకున్న వెంటనే ఉద్యోగోన్నతులు ఇవ్వడం.. ఖాళీలను కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది. జడ్పీలో శుక్రవారం ఆరుగురికి ఆగమేఘాల మీద ప్రమోషన్లు ఇచ్చారు. జడ్పీ యాజమాన్యం కింద పనిచేసే ఐదుగురు ల్యాబ్ అసిస్టెంట్లు, ఒక రికార్డు అసిస్టెంట్‌కు జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇన్‌చార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తే ఎవరైనా హర్షిస్తారు. కానీ ప్రభుత్వం బదిలీలపై ఉన్న బ్యాన్ ఎత్తివేసి, ఈ నెల 16 నుంచి జూన్ 2లోపు సాధారణ బదిలీలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఇలాంటి సమయంలో బదిలీల కోసం ఖాళీలు చూపి భర్తీ చేయాల్సిన ఉండగా.. అయిన వారికి ప్రమోషన్లు ఇచ్చి ఆ ఖాళీలను భర్తీ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ క్రమంలో గంట ముందు ఇచ్చిన స్థానాలను మార్చినట్లు సమాచారం. బదిలీల సమయంలో ఉన్న ఖాళీలను ప్రమోషన్ల పేరుతో భర్తీ చేసి, బదిలీల ఖాళీల కోసం ఎదురుచూస్తున్న సీనియర్ ఉద్యోగులకు అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. బదిలీల సమయంలో ప్రమోషన్ల ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదాస్పద నిర్ణయాల ఆలోచన పాలకులదా..? లేక అధికారులదా అని ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం న్యూటౌన్ మే 30(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్ బీ ఉమ్మడి జిల్లా క్లరికల్ సిబ్బంది బదిలీలకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎస్ఈ రాజగోపాల్ ఆధ్వర్యంలోని కమిటీ బదిలీల ప్రక్రియ చేపడుతుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక ప్రాంతంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారి జాబితాను ఇప్పటికే తయారు చేశారు. మినహాయింపులు ఉన్నవారి నుంచి రిక్వెస్ట్ లెటర్లు తీసుకుని, నిబంధనల ప్రకారం బదిలీలు చేస్తామని ఎస్ఈ తెలిపారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారిలో జూనియర్ అసిస్టెంట్లు ఐదుగురు, ఒక టైపిస్టు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, 14 మంది కార్యాలయ సబార్డినేట్స్ ఉన్నారు.

జడ్పీ ఉద్యోగులకు..

అనంతపురం విద్య: ఉమ్మడి జిల్లా జడ్పీ ఉద్యోగులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. 'ఖాళీలతో కబడ్డీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న జడ్పీ ఉద్యోగులందరూ శనివారం ఉదయం 9.30 గంటలకు జడ్పీకి రావాలని సూచించారు.

61 మంది నాన్ టీచింగ్ ఉద్యోగుల బదిలీ



బదిలీల కౌన్సెలింగ్‌పై మాట్లాడుతున్న డీఈఓలు

అనంతపురం విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో 61 మంది నాన్ టీచింగ్ సిబ్బంది బదిలీ అయ్యారు. రెండు జిల్లాల విద్యాశాధికారుల కార్యాయాలు, ఎస్ఎస్ఏలు, పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులకు శుక్రవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం డీఈఓ ప్రసాద్ బాబు, శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ కిష్టప్ప, ఏడీల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. సీనియర్ అసిస్టెంట్లు 16 మంది, జూనియర్ అసిస్టెంట్లు 22 మంది, రికార్డు అసిస్టెంట్లు 15 మంది, టైపిస్టు ఒకరు, ఆఫీస్ సబార్డినేట్స్ ఏడుగురు బదిలీ అయ్యారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు రెండు జిల్లాలకు పరస్పరం బదిలీ అయ్యారు.

ప్రత్యేక విద్యపై మూడు రోజుల శిక్షణ

అనంతపురం విద్య, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పెషల్ బీఈడీ, డీఎడ్ చేసి ఆర్‌సీఐ సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులకు ప్రత్యేక విద్యపై మూడు రోజుల శిక్షణ ఇస్తామని విశ్వభారతి కళానికేతన్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ టీఎస్ రెడ్డి తెలిపారు. తపోవనంలో జీపీఆర్ హాల్‌లో శుక్రవారం జరిగిన శిక్షణకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్పెషల్ బీఈడీ, డీఎడ్ చేసిన వాళ్లు తప్పనిసరిగా నిరంతర పునరావాస విద్య(సీఆర్ఈ) శిక్షణ పొందాలని ఆమె సూచించారు. ఈ కోర్సు చేయడం వల్ల వచ్చే 18 పాయింట్లు ప్రత్యేక విద్య చేసిన వారికి ఉద్యోగాల భర్తీ సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణకు 180 మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు మారెప్ప, వలీబా, పవన్‌కుమార్, సురేష్, మహమ్మద్ అలీ, లోకేష్‌రావు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 32వేలు

అనంతపురం రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 32వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 869టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అపూర్వ సహోదరులు..!

- విగ్రహాల తయారీలో రాణిస్తున్న అన్నదమ్ములు
- అగళి కళాకారుల నైపుణ్యానికి పలువురి ప్రశంసలు



పంచలోహాలతో తయారు చేసిన శివుడి విగ్రహాల వద్ద దేవరాజాచారి, విశ్వమూర్తి

అగళి, మే 30(ఆంధ్రజ్యోతి): దేవతా ఉత్సవ విగ్రహాల తయారీలో అందెవేసిన చేయి ఆ సోదరులది. జీవకళ ఉట్టిపడేటట్లుగా విగ్రహాలు తయారు చేయడం వీరి ప్రత్యేకత. శిల్ప, చిత్రకళా రంగాల్లో రాణిస్తూ పదుగురి చేత ప్రశంసలు పొందుతున్న ఆ అన్నదమ్ములే మండల కేంద్రానికి చెందిన దేవరాజాచారి, విశ్వమూర్తిచారి. తండ్రి శ్రీరంగ నుంచి వీరికి ఈ శిల్పకళ వారసత్వంగా అబ్బింది. దీంతో చిన్నప్పటి నుంచే చదువుతో పాటు శిల్పాలు తయారు చేయడాన్ని నేర్చుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన ఆలయ కమిటీల ఆర్డర్లపై అనేక ఉత్సవ విగ్రహాలు తయారు చేసి ఇచ్చారు. బంగారం, వెండి, పంచలోహాలతో ప్రభావళి, బసవన్న, శివుడు, లక్ష్మీదేవి, మారెమ్మ, ఆంజనేయస్వామి, నరసింహస్వామి, తదితర ఉత్సవ విగ్రహాలు అద్భుతంగా తయారు చేసి ప్రశంసలు పొందారు. లేపాక్షిలో కూడా శిల్పాలకు రంగులతోపాటు వివిధ అలంకరణలు చేపట్టారు. వీరి పనితనాన్ని మెచ్చిన బీజేపీ ఎమ్మెల్యే బంగారు లక్ష్మణ్ హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన ఈ అపూర్వ సహోదరులు తమ కళా నైపుణ్యంతో వివిధ ప్రాంతాల్లో పలువురి సత్కారాలు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కృష్ణ (జయంతి)




తెలుగు వెండితెరపై 'సూపర్ స్టార్'గా పేరొందిన పద్మభూషణ్ గ్రహీత కృష్ణ 1931 మే 31న గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో జన్మించారు. పూర్తిపేరు ఘట్టమనేని శివరామ కృష్ణమూర్తి. సినిమా రంగంలో నటుడిగానే కాక దర్శకుడిగా, నిర్మాతగా రాణించారు. ఐదు దశాబ్దాలలో ఎన్నో హిట్‌చిత్రాలు అందించారు. సొంత బ్యానరు పద్మాలయ ఫిల్మ్ స్టూడియో కింద పలు సినిమాలు రూపొందించారు. టాలీవుడ్‌లో సాంకేతికతను అందించడంలో ఎంత కృషి చేశారు. తొలి ఈస్ట్‌మన్ కలర్ (ఈనాడు), తొలి సినిమా స్కోప్ (అల్లూరి సీతారామరాజు), తొలి 70 ఎంఎం (సింహాసనం), తొలి డీటీఎస్ సినిమా తెలుగు వీర లేవరా, తొలి కౌబాయ్ సినిమా (మోసగాళ్ళకు మోసగాడు), తొలి జేమ్స్‌బాండ్ సినిమా (గూఢచారి 116) అందించిన ఘనత ఆయనదే. 350కుపైగా సినిమాలలో నటించారు. నంది, ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2022 నవంబరు 15న కన్నుమూశారు.

హూస్టన్ కమ్మింగ్స్ స్మిత్ (జయంతి)



హూస్టన్ కమ్మింగ్స్ స్మిత్ 1919 మే 31న జన్మించారు. అమెరికాలో రిలిజియస్ స్టడీస్‌లో ఎంతో పేరొందారు. ప్రపంచవ్యాప్తంగా ఈ అంశంలో ఎంతో ప్రముఖులు. మతాలు, ఫిలాసఫీపై 13 పుస్తకాలు రాయగా 2017 నాటికి ప్రపంచవ్యాప్తంగా 30లక్షలకుపైగా అమ్ముడయ్యాయి. మతం ఏదైనా సామాజిక న్యాయం, శాంతి ప్రధానమని భావించేవారు. ఆర్డర్ ఆఫ్ యూనివర్సల్ ఇంటర్ ఫెయిత్ అండ్ యూనివర్సల్ ఆర్డర్ ఆఫ్ సన్యాసాస్ ఇంటర్ ఫెయిత్-ఇంటర్ స్పిరిచ్యువల్ సేజ్ అవార్డు అందుకున్న తొలి వ్యక్తి. బర్కిలీలోని కేలిఫోర్నియా యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా కొనసాగారు. 2016 డిసెంబరు 30న కన్నుమూశారు.

క్లింట్ ఈస్ట్‌వుడ్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన నటుడు క్లింట్ ఈస్ట్‌వుడ్ 1930 మే 31న జన్మించారు. నటుడిగానే కాక సినీ దర్శకుడు, నిర్మాత, కంపోజర్. ఆయన కల్చరల్ ఐకాన్‌గా గుర్తింపు పొందారు. డాలర్స్ ట్రిలాజీలో మ్యాన్ విత్ నో నేమ్ కేరక్టర్ ఎంతో గుర్తింపు పొందింది. 70, 80 దశకాలలో పలు హిట్ సినిమాలలో నటించారు. 2014లో అమెరికన్ స్నైపర్ సినిమా బాక్సాఫీస్ రికార్డుగా నిలిచింది. నాలుగు అకాడమీ అవార్డు, గోల్డెన్‌గ్లోబ్ అవార్డులు, 3 సీజర్ అవార్డులు, ఎన్నో గౌరవాలు అందుకున్నారు.

వీర్ దాస్ (పుట్టినరోజు)



వీర్ దాస్ 1979 మే 31న డెహ్రాడూన్‌లో జన్మించారు. కమెడియన్‌గా, నటుడిగా, సంగీత దర్శకుడిగా రాణించారు. 35కుపైగా నాటకాలను, వంద కామెడీ షోలను ప్రదర్శించారు. ఆరు కామెడీ షోలను రాసి దర్శకత్వం వహించి నటించారు. బుల్లితెరపైనా, క్రమేపీ ఆయన రచనలు కొన్ని పత్రికల్లోనూ ప్రచురితమయ్యాయి. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ద్వారా జాతీయ గుర్తింపు పొందారు. 2024లో 52వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డ్సుకు హోస్ట్‌గా వ్యవహరించారు.

ఛత్తీస్‌ఘడ్‌లో బాగల్కోటె సైనికుడు గుండెపోటుతో మృతి

బెంగళూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె జిల్లా బాదామి తాలూకా చించలకట్టె తాండా నివాసి ఉపేంద్ర సోమనాథ రాథోడ్ (24) విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందాడు. మూడు నెలలక్రితం అస్సోం రైఫిల్స్‌లో చేరారు. ఛత్తీస్‌ఘడ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. శిక్షణలో కొనసాగుతుండగానే గుండెపోటుకు గురయ్యారు. ఆ వెంటనే అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందారు. మృతుడి పార్థివదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది.

మాముందే సెలూన్ ఓపెన్ చేస్తావా..?

దాడి చేసిన మహిళాగ్యాంగ్

బెంగళూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఓ సెలూన్‌లో పనిచేసే వ్యక్తి సొంతంగా షాప్ ఏర్పాటు చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని యజమాని నిషా మరో ఇద్దరితో కలసి దాడికి పాల్పడిన సంఘటన భువనేశ్వరినగర్ మెయిన్‌రోడ్డులో చోటు చేసుకుంది. సంజు (40) అనే వ్యక్తి కొడిగేహళ్ళి సమీపంలోని నిషాకు చెందిన సారా స్పాసెంటర్‌లో పనిచేసేవాడు. ఇటీవలే పని వదిలి కొత్తగా సెలూన్ ఏర్పాటు చేసుకున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని నిషా మరో స్నేహితురాలు కావ్యతో కలసి వెళ్లి సంజును రోడ్డుపైనే చితకబాదారు. గురువారం రాత్రి కిడ్నాప్ చేసి జాలహళ్ళివైపు తీసుకెళ్లి మరోసారి దాడికి పాల్పడ్డారు. పెట్రోల్ పోసి నీతోపాటు కుటుంబీకులందరినీ చంపివేస్తానని బెదరించినట్టు అమృతహళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సారా స్పాసెంటర్ యజమాని రోడ్డుపై సిగరెట్ తాగుతూ అతడిపై దాడి చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజీల ద్వారా పోలీసులు సేకరించారు. నిషా, కావ్యతో పాటు మహ్మద్ అనే ముగ్గురిని అమృతహళ్ళి పోలీసులు అరెస్టు చేశారు.

జొన్న కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

రాయచూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : జొన్నల కొనుగోలు కోసం రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. జిల్లాలోని సింధనూరు నగరంలో సింధనూరు తహసీల్దార్ కార్యాలయం వద్దకు జొన్నలను ట్రాక్టర్‌లో నిప్పుకుని వచ్చిన రైతులు తహసీల్దార్ కార్యాలయం గేటు అడ్డంగా వాహనాలు నిలిపి ఆందోళనకు దిగారు. దీంతో ప్రధాన రహదారి పై గంటకు పైగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం నాయకులు, ఇప్పటికే తాము ఆందోళన చేసిన సందర్భంగా అక్కడికి వచ్చిన తహసీల్దార్, వారం రోజుల్లోగా జొన్నల కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదెందు కని నిలదీశారు.

నత్తనడకన రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం

బంగారపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): కోలారు - బంగారపేట మార్గంలో బూదికోటె హుణసనహళ్ళి వద్ద చేపట్టిన రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణాలు మూడు సంవత్సరాలైనా నత్తనడకన కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్‌భారత యోజనె కింద సుమారు రూ.25కోట్లతో రైల్వే ఫ్లై ఓవర్ చేపట్టారు. ఈ నిర్మాణాలు ఏళ్లు గడిచినా పూర్తికాకపోవడంతో రాష్ట్ర రహదారి 950 బూదికోటె టేకల్ మార్గంలో ప్రజలు కొంకణ మీదుగా మైలారకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కోలారు - బంగారపేట మార్గంలో రైలు సంచారం మరింత సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతో అప్పట్లో ఎంపీ ఎస్ మునిస్వామి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ ఫ్లైఓవర్‌కు నిధులు రప్పించారు. 2022లో ప్రారంభమైన పనులు పథకం ప్రకారం ఒక ఏడాదిలో పూర్తి కావాల్సి ఉంది. అయితే మూడేళ్లు గడిచినా కేవలం పిల్లర్ల నిర్మాణదశలోనే ఆగిపోయింది. ఎలాటి ప్రగతి లేకపోయింది. ఫ్లై ఓవర్ కారణంగా రాష్ట్ర రహదారి దిక్కును మార్పు చేశారు. సుమారు ఒక కిలోమీటరు మేర మార్పు జరిగింది. ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్‌జామ్ చోటు చేసుకుంటోంది.

మూడేళ్లు గడిచినా అర్ధంతరంగానే....

తాత్కాలిక రోడ్డు నిర్మాణం కోసం రైల్వే పట్టాల సమీపంలో ఉన్న కొంత మంది ఇళ్లను తొలగించారు. దీంతో ఫ్లై ఓవర్ వస్తుంది, వాహన సంచారం సజావుగా సాగుతుందని భావించిన ప్రజలకు చకోర పక్షుల్లా ఎదురు చూడాల్సి వస్తోంది. రాష్ట్ర రహదారి పరిధిలోకి ప్రదేశాలలో నిర్మాణాలను రాష్ట్రప్రభుత్వం కూడా 50శాతం భరించాల్సి ఉంటుందనే కారణంతో అప్పటి ఎంపీ మునిస్వామి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైల్వేశాఖ భరించేలా ఒప్పించారు. అన్నీ అనుకున్నట్టుగాను 2022లో టెండరు పిలవగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కడప సూర్యనారాయణరెడ్డి కంపెనీ దక్కించుకుంది. అధికారుల వైఫల్యం, ప్రజా ప్రతినిధుల నిరుత్సాహం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కేంద్ర రైల్వేశాఖ చేపట్టిన ప్రాజెక్టు పూర్తి కాలేదు. ఇటీవలే ప్రస్తుత ఎంపీ మల్లేశ్‌బాబు స్థలాన్ని పరిశీలించి త్వరలోనే పనులు పూర్తి చేసే హామీ ఇచ్చారు. గతంలోనూ పలువురు ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారని అలా అలాగే ఉన్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



బూదికోటె సర్కిల్‌లో అర్ధంతరంగా ఆగిన నిర్మాణాలు ఇలా...

అధికారుల మధ్య సమన్వయం చేస్తాం : ఎంపీ

ఎంపీ మల్లేశ్‌బాబు స్పందిస్తూ ఆగిపోయిన ఫ్లై ఓవర్ పనులు పునః ప్రారంభించే అంశంపై అధికారులతో చర్చించామని, ప్రజాపనులశాఖ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ అంశంపై రైల్వే, ప్రజాపనులశాఖ అధికారులతో సమన్వయం సాధించి పనులు పూర్తి చేస్తామన్నారు. కాగా బంగారపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి స్పందిస్తూ రైల్వే ఫ్లై ఓవర్ పనులు ప్రారంభమై మూడేళ్లు గడిచినా ఇంకా పూర్తి కాలేదని దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైల్వే శాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. ఇక పోరాటమే దారి అన్నారు. పనులు వేగిరం చేసి పూర్తి చేయాలని కోరుతూ రైల్వేశాఖకు వ్యతిరేకంగా ప్రతిఘటిస్తామన్నారు.

ఉపాధ్యాయుల కొరత నడుమ... పాఠశాలలు ప్రారంభం



ఓ పాఠశాలకు పాచిపట్టిన గోడలు ఇలా..

బాగేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసి కొత్త విద్యాసంవత్సరానికి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అత్యంత వెనుక బడిన తాలూకా అయిన బాగేపల్లి తాలూకాకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు 665 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 430 మంది ఉన్నారు. మిగిలిన 235 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో హైస్కూల్‌లో సబ్జెక్టుల వారీగా 45మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకం చేపట్టడంతోపాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది.

మూతబడిన 70 పాఠశాలలు

తాలూకాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హైస్కూళ్ళలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రాఫ్ట్ టీచర్ ఇలా ఏళ్ల తరబడి సరైన నియామకాలు లేవు. క్రమేపీ విద్యార్థుల సంఖ్య తగ్గడంతో తాలూకాలో 2012 నుంచి ఇప్పటివరకు 70 కన్నడ ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. గతంతో పోలిస్తే ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలోనూ వెనుకబాటు ఉంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించడం ద్వారా వాటి మనుగడకు సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. తాలూకాలోని గూళూరు, మిట్టేమరి, బిళ్ళూరు, చాకవేలు, మార్గానుకుంటె, కొత్తకోటె తదితర గ్రామాలలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య తగ్గుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుల కొరత ఉంది. గ్రామాలలో ఎక్కువగా కూలి పనిచేసి జీవనం సాగించేవారే అధికం. సాధారణంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కన్నడలో రాయడం, చదవడం, అంకెలు, క గుణింతం కూడా రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. గుణాత్మక విద్య అందిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయులు లేకపోవడంతో భారంగా ప్రైవేట్ స్కూళ్లకు చేర్పించాల్సిన పరిస్థితి నెలకొంది.

పలుచోట్ల దుస్థితిలో తరగతులు

తాలూకాలో 236 ప్రాథమిక, 21 హైస్కూళ్లలో 852 తరగతి గదులు ఉన్నాయి. వీటిలో 627 మాత్రమే తరగతులు నిర్వహించడానికి అనువుగా ఉన్నాయి. 65 తరగతులకు తక్కువ మరమ్మతులు చేయాల్సి ఉండగా 164 తరగతి గదులు భారీ దుస్థితిలో ఉన్నాయి. వీటిని బాగు చేయాలంటే సుమారు రూ.35కోట్ల అవసరంగా అంచనా వేసి విద్యాశాఖ ప్రభుత్వానికి లేఖ పంపింది. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన కరువైందని పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు ఒకరు తెలిపారు. కొన్ని కన్నడ ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు 40ఏళ్లక్రితం నిర్మించినవి, వర్షం కురిస్తే లీకేజీ అవుతున్నాయి. పైకప్పులో నీరు నిచ్చి దెబ్బతిన్నాయి. పలుచోట్ల గోడలు నెర్రెలు వచ్చాయి. పిల్లలు నేలపై కూర్చునే పరిస్థితి లేదు. కుర్చీ, బెంచీలు లేవు. క్రీడా మైదానాలు లేవు. తాలూకాలోని ప్రాథమిక పాఠశాలల్లో 695 శౌచాలయాలు ఉండగా వీటిలో 86 కు చిన్నపాటి మరమ్మతులు చేయాల్సి ఉంది. 42 ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. 62 పాఠశాలలకు ప్రహరీగోడ లేదు. ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు పరిష్కారమవుతాయనే ప్రశ్న అందరిలోనూ ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



అడ్మిషన్లపై జాగృతి కార్యక్రమంలో బీఈఓ రామచంద్ర తదితరులు

ముళబాగిలు, మే 30(ఆంధ్రజ్యోతి): తాలూకాలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 3500 మంది విద్యార్థులను అడ్మిషన్ చేయించడం లక్ష్యంగా ఉన్నామని ఇందుకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని బీఈఓ కేఎన్ రామచంద్ర పిలుపునిచ్చారు. పట్టణంలోని డీవీజీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్య, సాక్షరతాశాఖ ఆధ్వర్యంలో అడ్మిషన్లకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నడ మేరుకవి డీవీ గుండప్ప బతికిన స్థలంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఇక్కడ ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పాలు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, షూ, బ్యాగ్ ఇతర సౌలభ్యాలు ఉన్నాయన్నారు. కొన్ని చోట్ల దుస్థితిలో ఉన్న తరగతి గదులను బాగు చేసే అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినట్టు తెలిపారు. డీవీజీ ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువమంది విద్యార్థులు ఉన్నారని, అదేరీతిన ఉపాధ్యాయులు గుణాత్మక విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తాలూకా స్థాయిలో విద్యారంగంలో మార్పులకు చర్యలు చేపట్టామన్నారు. పిల్లల చేరిక, హాజరు, మానవ వనరుల వినియోగంపై ఎమ్మెల్యే అధ్యక్షతన తాలూకా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బీఆర్‌సీ కన్వీనర్ పీ సోమేశ్ మాట్లాడుతూ తాలూకాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రగతికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. తాలూకాలో ఇప్పటికే మూసి వేసిన పది ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించే చర్యలు చేపట్టామన్నారు. ప్రధానోపాధ్యాయుడు సీ సొణ్ణప్ప, ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలు, మిఠాయిలు అందచేసి స్వాగతించారు. నగరసభ మాజీ సభ్యురాలు రాధిక రాజశేఖర్, ఎస్‌డీఎంసీ సభ్యులు రాధమ్మ, మంజుళమ్మ, ఉపాధ్యాయులు పద్మావతి, భారతి, జయంతి, భాగ్య, భాగ్యశ్రీ, మంజుళ, పద్మావతి, కవిత, సల్మ, అరుణ, నందిని, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో తరగతుల ప్రారంభం

విజయపుర దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో 2025-26 విద్యాసంవత్సరం తొలిరోజు పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం ఆత్మీయంగా స్వాగ తించారు. పూలు, చాకొలెట్, పాఠ్యపుస్తకాలు అందచేశారు. కాంగ్రెస్ మైనారిటీ బెంగళూరు గ్రామీణ జిల్లా అధ్యక్షుడు గౌస్‌ఖాన్ ముబారక్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి, ఇన్‌చార్జ్ ఫైరోజా, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శమ్షియా, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జహీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 350కు పైగా హాజరు

దొమ్మసంద్ర: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. దొమ్మసంద్ర ప్రభుత్వ మాదిరి ప్రాథమిక బాలుర పాఠశాలలో శుక్రవారం తరగతులు ప్రారంభం కాగా తొలిరోజు 350మందికి పైగా హాజరయ్యారు. ఇదే పాఠశాలలో 1985లో చదివిన పూర్వ విద్యార్థి యమరె గ్రామపంచాయతీ సభ్యులు, న్యూ మెకాలె స్కూల్ సంస్థాపకులు జైశంకర్ మాట్లాడుతూ తాను చదివేవేళ అప్పట్లో ఎక్కువగా వర్షాలు కురిసేవని, రోడ్లు ఎటు చూసినా బురదమయంగా ఉండేవని, బస్సు సౌకర్యం ఉండేది కాదన్నారు. యమరె నుంచి దొమ్మసంద్రకు 3 కిలోమీటర్లు నడిచి వెళ్లేవాళ్లమన్నారు. అప్పట్లో ఎంతో కష్టపడి చదవడంతోనే ఇప్పుడు స్టేజ్‌పై మాట్లాడే అవకాశం దక్కిందన్నారు. చదువును కష్టంతోకాకుండా ఆసక్తిగా చదవాలన్నారు. అప్పుడే ఉన్నత లక్ష్యం సాధ్యమన్నారు. విద్యను ఎవ రూ దోచుకోలేరన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నాగ రాజ్, ఉపాధ్యాయులు గాయత్రి, అంజలి హెగ్డే తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పూలు, చాక్లెట్లు అందజేత



దొమ్మసంద్రలో విద్యార్థులతో స్థానిక ప్రముఖులు

జానపదం అన్ని కళలకు మూలం

బెంగళూరు, మే 30(ఆంధ్రజ్యోతి): ఆదిమ మానవుడి కాలం నుంచి మనిషి అభివృద్ధి చెందినట్టే కళలు ప్రాచుర్యంలోకి వచ్చాయని, అయితే అన్ని కళలకు మూలం జానపదమని కేబినెట్ సెక్రటరీ ఆర్ చంద్రశేఖర్ అభి ప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జానపద సమావేశ ముగింపు సదస్సు శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పిల్లలు జానపద క్రీడ ద్వారా శారీ రకంగా శ్రమిస్తారన్నారు. ఆలోచనాశక్తి, పాటలు పాడడం కూడా సాధ్యమ న్నారు. సమాజంలో మార్పుకు చైతన్యానికి ఎన్నో కళలు ఉండవచ్చునని వీటన్నింటి తల్లివేరు జానపదమన్నారు. జానపద కళల్లో భాగస్వాములైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాసనాయక, కన్నడ సంఘం సంచాలకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి, జానపద శిక్షకులు హిదాయత్ అహ్మద్, అధ్యాపకులు నాగేశ్, నారాయణ, బీసీ నాగేంద్రకుమార్, ప్రొఫెసర్ పూర్ణిమా తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందచేస్తున్న కేబినెట్ సెక్రటరీ చంద్రశేఖర్ తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి...

బంగారపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య, మౌలిక సదుపాయాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణప్ప అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పీఎంశ్రీ కర్ణాటక మాదిరి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించి పూలు, చాకొలెట్‌లు అందచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠ శాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ఎల్‌కేజీ నుంచి తరగతులు ప్రారంభం అవుతు న్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, పాలు, కోడిగుడ్డు తదితర సౌకర్యాలు ప్రభుత్వం కల్పి స్తోందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు నాగరత్న, టీపీఓ మంజునాథ్, ఉపాధ్యాయురాలు జగదీశ్వరి, రాజలక్ష్మి, గజేంద్ర, విజయ లక్ష్మి, నారాయణస్వామి, శారదా, మణి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ రంగంతో 30 లక్షల మందికి ఉపాధి

70వ వార్షికోత్సవంలో పురస్కారాల ప్రదానం చేసిన గవర్నర్



సంఘం వార్షికోత్సవం ప్రారంభంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

బెంగళూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): హోటల్ రంగంలో 30లక్షలమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సాధ్యమయ్యాయని పర్యాటక అభివృద్ధి ఆర్థికతకు చేదోడు విభాగమని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అభిప్రాయపడ్డారు. గురువారం ఎఫ్‌కేసీసీఐలో కర్ణాటక హోటళ్లసంఘం 70వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ హోటల్ రంగం నగర, గ్రామీణప్రాంతాలతో పాటు అన్నిచోట్లా విస్తరించింది. పర్యాటక కేంద్రాల పరిధిలో అత్యుత్తమ ఆతిథ్యం అందించే హోటళ్లకు గుర్తింపు ఉంటుందన్నారు. భారతీయ సంస్కృతిలో రుచులు ఒకటన్నారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి హోటళ్ళపాత్ర కీలకమన్నారు. మన సంస్కృతి ఆచార, వ్యవహారాలు, స్థానిక రుచులు, హోటళ్ల ద్వారానే అన్ని ప్రాంతాలకు పరిచయం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఆతిథ్యరత్న, ఉద్యమరత్న పేరిట పలువురికి పురస్కారాలు అందించారు. ఎమ్మెల్యే సీఎన్ అశ్వత్థనారాయణ, హోటళ్ళసంఘం అధ్యక్షుడు జీకే శెట్టి, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ హెబ్బార, మాజీ అధ్యక్షుడు సీవీ మహదేవయ్య, హోటల్, రెస్టారెంట్ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు కే శ్యామరాజు పాల్గొన్నారు.

కన్నడ పట్ల అనుచిత వ్యాఖ్యలు తగదు



సంఘం నూతన పదాధికారులతో చంద్రశేఖర్

శిడ్లఘట్ట, మే 30(ఆంధ్రజ్యోతి): కన్నడ సంస్కృతి, పరంపర తెలియకుండా కన్నడ భాషపట్ల ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరికాదని కర్ణాటక పులకేశి సంఘం సంస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు జీ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. పట్టణంలో ప్రభుత్వ అతిథిగృహం వద్ద సంఘం తాలూకా శాఖ నూతన పదాకారులను ఎంపిక చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నటుడు కమల్‌హాసన్ ఇటీవల తమిళం నుంచి కన్నడ వచ్చిందని వ్యాఖ్యానించారని ఇది తమకు ఎంతో బాధ కలిగించిందన్నారు. కన్నడిగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కన్నడ భాషకు 2వేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందన్నారు. కన్నడ భాష, నేల, జల అంశాలలో తాము పోరాటాలకు సదా సిద్ధమన్నారు. కాగా సమాజసేవలో భాగంగా సరళ వివాహాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల ప్రజలు తమ ప్రతిష్టకోసం ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని తద్వారా ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితికి వస్తున్నాయని, ప్రైవేట్ స్కూళ్ల వ్యామోహం వీడాలన్నారు. సంఘం తాలూకా అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడి నారాయణస్వామి, యువ విభాగం అధ్యక్షులుగా కెంపనహళ్ళి అశోక్‌కుమార్ తదితరులను ఎంపిక చేశారు.

మద్యం షాపుల లైసెన్స్ ఫీజులు తగ్గించండి



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందచేత

బొమ్మనహళ్ళి, మే 30 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల లైసెన్స్ ఫీజులు తగ్గించాలని ఈడిగ సంఘం ముఖ్యమంత్రిని కోరింది. సంఘానికి చెందిన కే గోపిగౌడ్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ టీకే హరిప్రసాద్, మంత్రి జమీర్ అహ్మద్, సీఎం రాజకీయ సలహాదారుడు నజీర్ అహ్మద్, విజయ్‌సింగ్‌తో కలసి ముఖ్యమంత్రి సిద్దరామయ్యను మర్యాదపూర్వకం కలిశారు. రాష్ట్రంలోని ఈడిగ సామాజిక వర్గాన్ని ఆదుకోవాలని, మద్యంషాపుల లైసెన్స్ ఫీజులు తగ్గించాలని విన్నవించారు. ఈ బృందంలో బీటీఎం లే అవుట్, జేపీనగర్‌కు చెందిన ఈడిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

దొమ్మసంద్ర, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలోని ధర్మసాగర ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల బీకామ్ ఫైనలియర్ విద్యార్థులకు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. కళాశాల కోశాధికారి ధనరాజ్ మాట్లాడుతూ నేటి ఉన్నత విద్యకు 1968లో అప్పట్లో గ్రామ పెద్దలు వేసిన పునాదులే కారణమన్నారు. పూర్వీకులు ఎంతో శ్రమించి దూరదృష్టితో కళాశాలను నిర్మించారన్నారు. ఇక్కడ చదివినవారు ఐఏఎస్, ఐపీఎస్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సహా పలు రంగాలలో ఉన్నారన్నారు. కళాశాల కార్యదర్శి శాంతకుమార్ మాట్లాడుతూ చక్కటి ఆహారం, పెద్దల పట్ల గౌరవం, ఆత్మవిశ్వాసం, శాంతి, సహనం, మంచి ఆలోచనలు, సంస్కారంతో ముందుకు వెళ్లడం ద్వారా జీవితంలో ఓటమి ఉండదన్నారు. ఇదే సందర్భంగా ప్రతిభావంత విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు ప్రదానంచేసి అభినందించారు. కళాశాల డైరెక్టర్ మనోహర్, జగన్నాథ్ తోపాటు 1990-93 బ్యాచ్ విద్యార్థుల ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కేశవ బాబురెడ్డి, పూర్ణచంద్ర, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి బాయ్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1592.96	1,577.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,778	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	153	30
నీటి నిల్వ (టీఎంసీలు)	13.68	3.33

ఔషధ కేంద్రాల మూసివేతతో పేదలకు అన్యాయం

● ప్రధాని మోదీ ఫొటో ఉందనే దుకాణాల తొలగింపు ● బీఐఎంఎస్‌లో బీజేపీ నాయకుల నిరసన

బళ్లారి, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో ఉన్న జన ఔషధ కేంద్రాన్ని మూసేసి పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేస్తుందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం బళ్లారి బీఐఎంఎస్ లో జన ఔషధ కేంద్రం వద్ద బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనీల్ నాయుడు, కోనంకి తిలక్, ఐనాత్‌రెడ్డి, బుడా మాజీ అధ్యక్షుడు మారుతి, శ్రీనివాస్‌మోత్కర్, ఇతర బీజేపీ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. పేదలకు చౌకగా మందులు అందించాలనే మంచి ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జన ఔషధ కేంద్రాలను ప్రారంభించింద న్నారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయ దురుద్దేశంతో జన ఔషద కేంద్రలను మూసేయించిదని ఆరోపించారు. మందుల కేంద్రాల పై ప్రధాని మోదీ బొమ్మ ఉందన్న కారణంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 1400 జన ఔషద కేంద్రాలు ఉంటే వీటిలో 200 పైగా మూసేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని ఆయన ఆరోపించారు. జన ఔషద కేంద్రాల వద్ద ఎంతో మంది పేద రోగులకు మందులు తక్కువ దరకే లభిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు డాక్టర్ అరుణ. సురేఖ, జ్యోతి ప్రకాష్, రాజేశ్వరి, శోభా, తస్లీమా, రామలింగప్ప, లింగారెడ్డి, బసలింగన్నగౌడ, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో బీజేపీ నాయకులు



నగరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

● వార్డుల్లో పరిశుభ్రత పాటించాలి : ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి సిటీ/రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని వార్డుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, వర్షాకాలంలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చూడాలని నగర ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని బాపూజీ నగరం తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన స్థానికులతో సమస్యలపై ఆరా తీశారు. మురుగునీటి పారుదల, అంతర్గత డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుద్యం వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పించడానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. 7వ వార్డు మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలు ఉమాదేవి, ఎం.ప్రభంజనకుమార్, మించు సీన, రామాంజనేయ,శివరాజ్ హెగ్డే, భరత్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి వెంకటేశ్ హెగ్డే పాల్గొన్నారు.

మంజూరైన నిధులు సభ్యులకే కేటాయించాలి : మాజీ మంత్రి

గోరంట్ల, మే 30(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయానికి మంజూరైన నిధులను కార్యవర్గ సభ్యులైన ఎంపీటీసీలకే కేటాయించాలని తద్వారా అభివృద్ధి జరిగేలా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ను డిమాండ్ చేశారు. శుక్రవారం వైసీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఆమె గోరంట్ల మండలపరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓతో చర్చించారు. సభ్యులను ఎప్పుడు తక్కువ చేసి చూడలేదని మంత్రి ఆదేశాలను అమలు చేయాల్సి ఉందని ఎంపీడీఓ ఆమెకు వివరించారు.

ఆంజనేయ విగ్రహానికి రూ.2లక్షలు

హిందూపురం, మే 30(ఆంధ్రజ్యోతి): సూగూరు ఆంజనేయస్వామి 40 అడుగుల ఏకశిల విగ్రహానికి వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షులు ఆదినారాయణప్ప రూ.2లక్షలు విరాళాన్ని విగ్రహ ట్రస్ట్ చైర్మన్ వైసీ చంద్రశేఖర్‌కు అందజేశారు. శుక్రవారం దాత ఆది నారాయణప్ప చెక్కును చంద్రశేఖర్, రాయల్‌గోపాల్‌కు అందజేశారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభించిన ఎంపీ



రైల్వే వంతెన పనులను ప్రారంభిస్తున్న ఎంపీ తుకారాం

బళ్లారి గాంధీనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా పరిధిలోని హగరిబొమ్మనహళ్ళి పట్టణంలోని రామనగర్ రైల్వేగేట్ ఎల్‌సీ-37 వంతెన పనులను ఆగస్టు నెలలో ప్రారంభించనున్నట్లు ఎంపీ తుకారం తెలిపారు. హగరిబొమ్మనహళ్ళి పట్టణంలో బ్యాలాళు చెరువు వద్ద రూ 35.5కోట్లతో నిర్మించ తలపెట్టిన ఎల్‌సి.35 రైల్వే వంతెన, రోడ్డు నిర్మాణం పనులను గురువారం ఆయన ప్రారంభంచారు. మరిమ్మనహళ్ళి నుంచి హగరిబొమ్మనహళ్ళి గుండా శివమొగ్గ వైపు వెళ్ళే జాతీయ రహదారిని చతుష్పథగా అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో చర్చించి రూ 1,350కోట్లతో నివిదేక అందజేసినట్లు తెలిపారు. తాలూకా పరిధిలో మూడు చోట్ల డిజిటల్ లైబ్రరీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతి అలవాటు చేసుకొనేందుకు వీలుగా రైతు సమాచార శిక్షణా కేంద్రాన్ని స్థాపించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని సోనియాగాంధీ నగర సముదాయ భవన్‌లో నమ్మ క్లినిక్, కార్మిశాఖ మొబైల్ క్లీనిక్‌ను ఆయన ప్రారంభించిన అనంతరం ఏపీఎంసిలో ఇందిరా క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఎంపీ వెంట స్థానిక ఎమ్మెల్యే కె.నామరాజ్ నాయక్, పురసభ అధ్యక్షుడు ఎం.మరిరామప్ప, గ్యారెంటీ పథకాల అమలు సమితి జిల్లా అధ్యక్షుడు కురి శివమూర్తి, తాలూకా అధ్యక్షులు సొన్నద గురుబసవరాజు, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు బి.గంగాధర్, తాహసీల్దారు ఆర్.కవితా,పురసభ సభ్యులు పాల్గొన్నారు.

బస్సుపాస్‌కు దరఖాస్తు చేసుకోండి

విజయనగరం (హోస్పేట), మే 30 (ఆంధ్రజ్యోతి) : హోస్పేట డివిజన్‌లోని విద్యార్థులకు 2025-26 సంవత్సరానికి సేవా సింధు టెక్నాలజీ ద్వారా పూర్తిగా కంప్యూటరీక రించిన పద్ధతిలో ఉచిత, రాయితీ బస్సు పాస్‌లకు దరఖాస్తు చేసుకోవాలని హోస్పేట డివిజనల్ కంట్రోలర్ తిమ్మారెడ్డి హీరా తెలిపారు. డివిజన్ పరిధిలోని హోస్పేట, కూడ్లిగి, కొత్తూరు, హూవిన హడగలి, హగరి బొమ్మనహళ్లి, హరప్పనహళ్లి యూనిట్ల నుంచి పాస్‌లు పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

2నుంచి జైన శ్వేతాంబర్ శతాబ్ది ఉత్సవాలు

బళ్లారి సిటీ, మే 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని తేరు వీదిలో శ్రీ పాశ్వనాథ్ జైన్ శ్వేతాంబర్ మందిరంలో జూన్ 2 నుంచి శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి రోషన్ జైన్ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2నుంచి 6వతేదీ వరకు ఐదు రోజుల పాటు శతాబ్ది ఉత్సవాలు జరుగుతాయన్నారు. చైర్మన్ ఉత్సవ్ లాల్ బాగ్రేచా, అనిల్ పుమానీ,ప్రకాశ్ జైన్, ప్రకాశ్ మెహతా,కాంతిలాల్ జైన్,వినోద్ బాగ్రేచా, సూరజ్, పాషనాత్‌జైన్ పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్ వంటకాల పరిశీలన

కంప్లి, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇందిరా క్యాంటీన్ వంటకాలను పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా క్యాంటీన్ సదుపాయాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పరిశుభ్రంగా వంట చేయాలని సిబ్బందికి సూచించారు.

4వ రోజుకు పౌర కార్మికుల సమ్మె

● చెత్త సేకరించేవారు లేక ప్రతిచోటా దుర్వాసన..



నగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

బళ్లారి సిటీ,మే 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించడం సహా పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పౌర కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి నాల్గవ రోజుకు చేరుకుంది. విజయనగరం జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతోంది. హొసపేటనగర్, కమలాపూర్, మరియమ్మనహళ్ళి, కూడ్లిగి, కొట్టూరు, హగరిబొమ్మనహళ్ళి , హూవిన హడగలి, హరపన హళ్ళిలో చెత్త తొలగింపు పూర్తిగా నిలిచిపోయి. రోడ్లపక్కన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్టుమెంట్ కార్యదర్శి బెంగళూరులో కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరిపారు. అయితే అవి ఫలించలేదు. అందువలన చర్చలు విఫలమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చర్చలకు పిలిచారని, సంఘం నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని కర్ణాటక రాష్ట్ర పౌర సేవకుల సంఘం హొసపేట శాఖ అధ్యక్షుడు నాగేంద్ర వర్మ అన్నారు.

పౌర కార్మికులకు సీఐటీయూ మద్దతు



నిరసనలో పాల్గొన్న పౌరకార్మికులు

తోరణగల్లు : పౌర సేవా సంఘం కార్మికులు కురేకుప్ప పురసభ కార్యాలయం ముందు నాలుగు రోజులుగా చేస్తున్న నిర్దిష్టమైన సమయం లేని ప్రతిఘటనకు సీఐటీయు, కర్ణాటక ప్రాంత రైతు సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సీఐటీయు పదాధికారి వీ దేవన్న జేడీఎస్ ప్రముఖులు సోమన్న ప్రతిఘటన ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులు కోరికలు నెరవేర్చాలని వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు జీడీఎస్ తాలుకా అధ్యక్షులు సోమన్న, కర్ణాటక ప్రాంత రైతు సంఘం తాలుకా అధ్యక్షులు పంపన్నగౌడ, మంజునాథ, సిద్దప్ప, కే పంపాపతి, ఆదినారాయణ పాల్గొన్నారు.

సిరుగుప్ప : పౌర కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆగదని పౌర కార్మికుల సంఘం అధ్యక్షుడు వెంకోబ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి పంపాపతి, ఈశ్వర్, శంకర్‌గౌడ, మల్లికార్జున, సుంకప్ప, రాఘవేంద్ర, వసంత, స్వర్ణలత, మహేశ్వరి కార్మికులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

● 8 మంది అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు

బళ్లారి గాంధీనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా గంగావతి పోలీసులు భారీ ప్రమాణంలో హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రామ్ అరసిద్ది తెలిపిన వివరాల మేరకు థాయిలాండ్ నుంచి గంజాయి తీసుకొచ్చి కొప్పళ జిల్లాలో అమ్ముతున్న 8 మందిని అరెస్టు చేయడంతో పాటు 1806 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ 18లక్షలు వరకు చేస్తుందని పోలీసులు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సాజీశ్, సలీం, బి.దుర్గా, బాద్‌షా, మదన్, సూర్యప్రతాప్ రెడ్డి, అమీద్, మణికంఠలు కాగా వీరిలో ముగ్గురు కేరళరాష్ట్రానికి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. జిల్లాలో తొలి సారిగా భారీ ప్రమాణలో హైడ్రో గంజాయిని పట్టుకున్నట్లు వివరించారు. పార్టీకోసం థాయిలాండ్ నుంచి గంగావతికి సలీం రెండు కార్లలో అక్రమంగా గంజాయిని తీసుకొచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. గంగావతి ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తుంగభద్ర నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలి : రైతు సంఘం

బళ్లారి సిటీ,మే 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది తుంగభద్ర జలాశయం నుంచి నీరు అందించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని, నీటి విడుదలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూర్ పురుషోత్తమగౌడ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల, ఆనకట్ట నిపుణుడు కన్నయ లాల్ మాట్లాడుతూ ఈసంవత్సరం 70శాతం నీటిని మాత్రమే నిల్వ చేయగలమన్నారు. దీని కారణంగా నీటి విడుదలపై రైతుల్లో ఆందోళన చెందుతున్నారన్నారి, రెండవ పంటకు నీరు అందుతుందా, లేదా అన్నదానిపై అధికారులు ప్రకటించాలన్నారు. జలాశయంలో 25టీఎంసీల నీరు నిండిన వెంటనే కాలువల్లోకి నీటిని విడుదల చేస్తే అది రెండవ పంటను పండించడానికి సహాయపడుతుంది. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జలాశ యం 19గేటు విరిగిపోయినప్పుడు జలవనరుల మంత్రి డి.కే.శివకుమార్ ఈ గేటుతో సహా జలాశయం యొక్క అన్నిగేట్లను మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కొంచిగేరి మల్లప్ప, సిద్దయ్యస్వామి, గోవిందప్ప, భీమనగౌడ, బసవరాజప్ప, ఉమేశ్‌గౌడ, జాలిహాళ్ శ్రీధరగౌడ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు పురుషోత్తమగౌడ

హోసూరు జోన్

కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం

హోసూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని 600 సంవత్సరాల చరిత్ర కల్గిన కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా జరిగింది. రెండు సంవత్సరాల నుంచి ఆలయ జీర్ణోద్ధరణ పనులు సాగాయి. ఈ నేపథ్యంలో దేవతామూర్తుల ప్రతిష్ఠాపన, కుంభాభిషేక కార్యక్రమాలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఈనెల 28న కార్యక్రమాలు ప్రారంభం కాగా ప్రధాన ఘట్టం కుంభాభిషేకం శుక్రవారం జరిగింది. పలు హోమాదికాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పవిత్ర జలాలతో కుంభాభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



శిఖరాలకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

కమల్ వ్యాఖ్యలపై నిరసన



నిరసనలో తమిళజాతీయ ఉద్యమసంఘం కార్యకర్తలు

హోసూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా, వ్యతిరేకంగా పలు సంఘాలు కార్యక్రమాలు నిర్వహించాయి. కాగా ఎక్కుశాతం సంఘాలు కమల్‌హాసన్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందనే కమల్‌హాసన్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నిరసనలో సంఘం ప్రధాన కార్యవర్గ సభ్యుడు మారిముత్త ప్రసంగించారు. ఆయన వ్యాఖ్యల వల్ల కర్ణాటకలోని తమిళులకు ప్రమాదం కానుందని అభిప్రాయపడ్డారు. బత్తలపల్లి శాఖ కార్యదర్శి వనమూర్తి, మణికంఠన్, రాయకొట్టై కార్యదర్శి లక్ష్మణన్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాలు చేరకుండా నియంత్రించాలని వినతి

హోసూరు, మే 30(ఆంధ్రజ్యోతి): తెన్‌పెన్నై నదిలో రసాయన వ్యర్థాలు చేరకుండా నియంత్రించాలని తమిళనాడు రైతుసంఘం డిమాండ్ చేసింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం నేతృత్వంలో నిరసన చేపట్టారు. హోసూరు తాలూకాలోని 2వేల ఎకరాల వరిభూము సాగుదారులకు భూమి హక్కులు ఇవ్వాలని, కావేరి దక్షిణ అటవీ అభయారణ్యంలోని 165మంది గ్రామస్థుల బహిష్కరణను ఆపాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో ఆలిండియా జాయింట్ సెక్రటరీ రవీంద్రన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు. రైతుసంఘం నుంచి 500మందికిపైగా సభ్యులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న రైతు నాయకులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

కంప్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : కంప్లి, కురుగోడు తాలుకా పరిధిలోని రైతన్నలకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. శుక్రవారం ఏపీఎంసీ ఆవరణంలో ఎమ్మెల్యే గణేష్ గంగా కళ్యాణ యోజన లబ్దిదారులకు బోర్‌వెల్ సామాగ్రిని పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 122 మంది లబ్దిదారులకు ఒక రైతుకు రూ. 2.50 లక్షలను అందజేశారు. ఎస్టీ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మల్లికార్జున, తాలుకా అభివృద్ధి అధికారి బీఎస్ రేవణ సిద్దప్ప, మెటీరియల్ సరఫరా దారు ఆర్ యర్రిస్వామి, తహసీల్దార్ మంజునాయక్, శ్రీకుమార్, ముఖ్య అధికారి దురుగన్న తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సేద్యం పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ



పేదలకు టైటిల్ డీడ్‌లను అందజేస్తున్న అధికారులు

విజయనగరం (హోస్పేట), మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని వినియోగించుకోవాలని శృతి మల్లప్పగౌడ్రు అన్నారు. హోస్పేట తాలుకా దేవలాపుర గ్రామంలో శుక్రవారం ఇళ్లు నిర్మించుకున్న లబ్దిదారులకు టైటిల్ డీడ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూమి హామీ పథకం కింద దేవలాపురం గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చారు. ఈ గ్రామంలో ప్రజలు ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకుని దాదాపు 70 యేళ్లుగా ఇక్కడ నివసిస్తున్నారు. దీనిని గమనించిన ప్రభుత్వం హక్కు పట్టాలు పంపిణీ చేసిందన్నారు. ఈ సందర్భంగా మరియమ్మనహళ్లి డీటీ శ్రీధర్, ఆర్ఐ షరీఫ్, గ్రామ పరిపాలనాధికారి శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుంభోత్సవం సందర్భంగా శాంతిసభ

బళ్లారిరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ తాలుకాలోని బాల చింత గ్రామంలో 3,4 తేదీల్లో మారెమ్మదేవి కుంభోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామంలో శాంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఘర్షణ చోటు చేసుకోకుండా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ ప్రహ్లాద తహసీల్దార్ రేఖ మోకా ఎస్ఐ కాళింగ గ్రామస్తులు గ్రామ పీడీఓ అధ్యక్షుడు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీల ఢీ..డ్రైవర్‌కు గాయాలు

బళ్లారిరూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : రెండు లారీలు ఢీ కొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం పీడీహళ్లి గ్రామ పంచాయతీ వద్ద తెల్లవారుజామున గుంతకల్లు నుంచి బళ్లారి వైపు వెళ్తున్న లారీని వెనకవైపు మరో లారీని బలంగా ఢీ కొంది. ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలుగా స్థానికులు గమనించి బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.



దెబ్బ తిన్న లారీ

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

కంప్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : హోస్పేట నగరంలోని శుక్రవారం పంపా కళామందిర్‌లో ఇల్కల్ రంగ సంగమ కళా బృందం, సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో అల్లమ్మ ప్రభు నాటకం గురువారం రాత్రి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పౌరాణిక నాటకాలు ప్రాముఖ్యులు పక్కీరప్ప మాట్లాడుతూ పౌరాణిక నాటకాల మానసిక ఒత్తిళ్లు తగ్గుతాయన్నారు. ఆధునిక కాలంలోనూ నాటకాలను ఆదరించడం హర్షణీయమన్నారు.

మార్కెట్ యార్డులో అక్రమాలను అరికట్టాలని వినతి

సిరుగుప్ప, మే 29 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ గాంధీ మార్కెట్ యార్డులో అక్రమ వ్యవహారాలను అరికట్టాలని సిరుగుప్ప తాలుకా రక్షణ పడే సంఘం అధ్యక్షుడు నూర్ బాషా కోరారు. సిరుగుప్ప పట్టణం డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థకు వినతిపత్రం అందజేశారు. కాయగూరల మార్కెట్ యార్డులో కొన్ని షెడ్లు నిరుపయోగంగా మారాయన్నారు. రాత్రి వేళల్లో అక్రమ వ్యవహారాలు జరుగుతున్నా పోలీసు శాఖ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా రక్షణ వేదిక నాయకులు వాసీమ్ అక్రమ్, ఖాసీమ్ పాల్గొన్నారు.

పిల్లల్లో ప్రతిభను వెలికితీయాలి..



సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో బాలల రక్షణ అధికారి ఎలెనాగప్ప

బళ్లారి సిటీ, మే30(ఆంధ్రజ్యోతి): పిల్లల్లోని ప్రతిభను గుర్తించడానికి వేసవి శిబిరాలు అవసరమని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఇవి దోహద పడతాయని జిల్లా బాలల రక్షణ యూనిట్ జిల్లా బాలల రక్షణ అధికారి ఎలె నాగప్ప అన్నారు. శుక్రవారం నగరంలోని కంటోన్మెంట్‌లోని శాంతిధామ్ ప్రాంగణంలోని ప్రభుత్వ బాలికల బాలమందిరంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, రాజ్య బాలభవన్ సొసైటీ బెంగళూరు, మహిళా శిశు అభివృద్ధి శాఖ , జిల్లా బాలల రక్షణ విభాగం నిర్వహించిన 'సమ్మర్ క్యాంప్' కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 5నుంచి 16సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకోసం 16రోజుల పాటు పెయింటింగ్, హస్తకళలు, సమూహ నృత్యం, సమూహ గానం, కరాటే ,యోగా వంటి సృజనాత్మక వెలికి తీసే కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈసమావేశానికి బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మైదూరు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈసందర్భంగా ప్రభుత్వ మానసిక దివ్యాంగుల వసతి గృహం సూపరింటెండెంట్ గురుబసవ, ప్రభుత్వ బాలికల గృహ ఇన్‌స్పెక్టర్ నాగవేణి, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు కళావతి, గంగమ్మ, దొడ్డబసప్ప, సురేశ్, భీమలింగ శ్రీజ, జగన్నాథ్, మంజునాథ్, మల్లికార్జున దేవమ్మ , తులసి పాల్గొన్నారు

ప్రజా పనుల శాఖ ఇన్‌చార్జ్ ఏఈఈగా గవియప్ప

బళ్లారి గాంధీనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా పనుల శాఖ, బళ్ళారి సబ్‌డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా గవియప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న సుదర్శన్ రెడ్డి మే 30, శుక్రవారం పదవీ విరమణ చేయడంలో ఆ బాధ్యతలను అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గవియప్పకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రెండేళ్ళపాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయగా పనిచేసిన తనకు సిబ్బంది, సహ ఇంజనీర్లు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే సహకారం ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ ఇంజనీయర్‌గా బాధ్యతలు చేపట్టిన గవియప్పకు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన సుదర్శన్ రెడ్డికి బళ్ళారి సబ్ డివిజన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలకగా, కొత్తగా బాధ్యతలు స్వీకరిచిన గవియప్పకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీయర్లు చలపతి, సురేష్, నవీన్, కార్యాలయం సిబ్బందితో పాటు కాంట్రాక్టర్లు గోవింద రెడ్డి, సంతోష్ గౌడ, తదితరులు పాల్గొన్నారు.



గవియప్పను అభినందిస్తున్న రిటైర్డ్ ఏఈఈ సుదర్శన్ రెడ్డి